

# ఈ ప్లాటు అమ్మకానికి కాదు

'ఫ్లాట్స్ ఫర్ సేల్' - 'ప్లాట్లు అమ్మబడును...' అన్న బోర్డు కనిపించినప్పుడల్లా కథకు మంచి ప్లాటు దొరకుతుందేమోనని వర్ధమాన రచయితకు ఆశ కలగటం సహజం. నవలా నిర్మాణంకోసం అడుగు ముందుకు వేస్తే గృహనిర్మాణంకోసం ప్లాటు దొరుకుతుంది. నిరుత్సాహజనకం అవుతుంది. కథ వ్రాయాలంటే 'ప్లాటు'- కథావస్తువు కావాలి గదా మరి!

కథావస్తువు కావాలంటే అన్నిటికంటే సులభమైన మార్గం పాత పత్రికలు, అట్టలు చిరిగిపోయిన నవలలు తిరగవెయ్యటం. అనామకమై మనకు ఉత్కృష్టమైనవిగా కనిపించే రచనలు తారసిల్లవచ్చు. అవి కాపీ కొడితే చాలామందికి తెలియదు. మనం గొప్ప మేధావంతులమనే భ్రమ మనకూ, పాఠకులకూ గూడా కలుగుతుంది. ఒక్కొక్కచోట చిక్కు వస్తుంది. ఏ 'చెలియలికట్ట'నో దొరికిందనుకోండి. ఎవరు వ్రాశారో మనకు తెలియక, పాఠకులకే తెలియదనుకుని నవల తిరగదోడి వ్రాస్తే, విశ్వనాథ వారిని స్వయంగా ఎరగని వాళ్ళు మనల్ని చూసి 'ఆయనే' అనుకోవచ్చు.

ఈ బెడదలన్నీ కాకుండా ఉండటానికి మొక్కపాటివారు ఒక సూచన చేశారు 'తెలిసింది వ్రాయి' అని. తెలిసినవి రెండు రకాలుగా ఉంటాయి. 'కన్నవీ.... విన్నవీ...' వీటినే వారు అనేకం కథలుగా మలిచారు. స్వయంగా జీవితంలో అనుభవించినదీ, మనకు విశ్వాసపాత్రులైనవారి అనుభవాలు మనకు చెప్పగా విన్నవీ. ఈ రెండూ కాకపోతే సత్యానికి

దూరమై జానపదానికి దగ్గర అవుతుంది.

ఆఫీసు పనిమీద ఈ మధ్యనే ఒకసారి విశాఖపట్టణం వెళ్ళవలసి వచ్చింది. లాడ్జిలో కూర్చుని మిత్రులతో మాట్లాడుతున్నాం. లాడ్జీలు, కాంట్రాక్టర్లు (అన్ని రకాలు), వేశ్యలు, దేశం భవిష్యత్తు, చరాచర జగత్తు యుగాంతంలో తీర్చిదిద్దుకునే రూపురేఖలు దగ్గరనుంచీ కాఫీకని డబ్బులిచ్చి పంపిన కుర్రవాడు తిరిగి రాకపోవటానికి గల కారణాలు విశ్లేషించటం వరకు చర్చ జరుగుతోంది.

'ఎవర్నీ నమ్మటానికి వీల్లేదు...'

'ఎవర్నీ నమ్మకుండా బ్రతకలేం...'

'చచ్చినా నమ్మకూడదు...'

'నిజం ఎవరూ చెప్పరు...'

ఇట్లా సంభాషణ జరుగుతుండగా మా మిత్రుడు ఒక్కసారిగా నావంక తిరిగి 'ఇంత మంది వేశ్యల్ని చూశాంగదా.... ఒక్కతైన్నా వేశ్యనని ఒప్పుకుందా...? పత్తిత్తునని చెప్పుకుంది గాని....' అన్నాడు. నాకేం చెప్పాలో తెలియలేదు. అతనితో నేను కలిసి తిరిగినవి కాఫీ హోటళ్ళు, సినిమాహాళ్ళు మాత్రమే. అతన్ని నిరుత్సాహపరచటం ఇష్టంలేక 'అవును....' అన్నాను. లేకపోతే ఆసక్తిదాయకంగా సాగుతున్న గోష్ఠి నిలిచి పోయేది. తనకు గల అనుభవం అందరికీ ఉంటుంది అనుకోవటంలోనే చిక్కు. అట్లాంటి స్నేహితులుంటే మనం స్వయంగా తెలుసుకోలేని సంగతులు పరోక్షంగా తెలుసుకోవచ్చు. జీవితంలో అన్ని రకాలైన అనుభవాలు రచయిత రుచిచూడవలసిన అవసరం తప్పుతుంది. రచయితకు స్వయంగా అనుభవం కావాలని కోరుకునే నరసహృదయులతోపాటు, రచయితలు తిరుగుబోతులనీ, తాగుబోతులనీ, దొంగలనీ, హంతకులనీ సదభిప్రాయం ఉన్న సదాచారులూ లేకపోలేదు. ఆలోచనలు రావటం లేదని సిగరెట్టు ముట్టిస్తే అందులోని పొగ రావటమేకాని ఆలోచన రాని సందర్భాలు నాకు తెలుసు. అట్లాంటి వాళ్ళు జీవితానుభవం సంపాదిద్దామని బయలుదేరి అనుభవంలోనే ఉండిపోవటం, ఆసుపత్రిలో చేరిపోవటం, కారాగారానుభవం అప్రయత్నంగా పొందటం గూడా కొండొకసారి జరుగుతుంది. ఉరిశిక్షవేస్తే తప్పించుకుని పారిపోయిన రష్యన్ రచయిత అనుభవం అందరూ కోరుకోనక్కర లేదు. కోరిక ఉన్నా ఓపిక ఉండాలిగదా! కలిగిన అనుభవాన్ని, తెలిసిన నిజాల్ని అందంగా చెప్పటంలోనే ఉన్నది సొగసు. అందుకని మొక్కపాటివారన్నట్లు తెలిసిన విషయం వ్రాస్తే జనాన్ని మోసం చేయటం జరగదు– ఆత్మవంచన ఉండదు.

కథకు ప్లాటు వెదకటం నిత్యాన్వేషణ. విశాఖపట్టణం వెళ్ళినప్పుడు ఏదన్నా కథ వ్రాయాలనిపించింది, ఆకాశం వంక చూస్తే సముద్రంలా ఉన్నది. మబ్బులన్నీ అలలు, అలలుగా వస్తున్నాయి. ఆహ్లాదంగా ఉన్నది. అయితే చంద్రుడు పడవలాగా ఉన్నాడనీ, నక్షత్రాలు చేపల్లాగా ఉన్నాయనీ వ్రాయాలని అనిపించింది. నీళ్ళలో చేపలు మెరుస్తుంటాయి మరి. లేకపోతే సముద్రంలో ఈతలు కొడుతున్న బెస్తవారి పిల్లలని గూడా వర్ణించవచ్చు. అయితే మేం రైలు దిగింది పట్టపగలు. చందమామా లేదు. నక్షత్రాలూ లేవు. ఊహకు, వాస్తవానికి మధ్య ఆకాశం అంతదూరం.

ఇంత పట్టణంలో కథావస్తువు దొరక్కపోతుందా అని రైలు దిగినప్పటినుండీ అటూ ఇటూ జాగ్రత్తగా చూస్తుంటే మా జీపు డ్రైవర్ 'సార్... ఏమన్నా పడిపోయిందా...' అని అడిగాడు.

'ఏమన్నా దొరుకుతుందేమోనని వెతుకుతున్నాను' అని వాడికి చెప్పటం ఎలా? అందుకని 'అబ్బే... ఊరికే చూస్తున్నాను...' అన్నాను. ఊరికి కొత్త కాబట్టి అలా చూస్తున్నాను కాబోలు అని గ్రహించి అక్కడినుంచి దారిలో కనిపించే ప్రదేశాలన్నిటిని చెప్పుకుపోతున్నాడు. దొండపర్తి, డాబా గార్డెన్స్.... ఎల్లమ్మ తోట.... జగదాంబా.... ఇట్లా చెప్పుకుని పోతున్నాడు. కె.జి. హెచ్., కలెక్టర్ ఆఫీసు రోడ్డు చూపించాడు. ఆపైన నీలకొండ కనిపించింది.

'ఆ కొండ ఎంతదూరం ఉంటుంది...?' అని అడిగాను సాయంకాలం షికారు పోదామని.

'ఏ కొండ సార్....?'

'అదే.... ఎదురుగా కనిపించటం లేదూ... నీలంగా...' అన్నాను.

'అది కొండకాదు సార్.... అదే సముద్రం....' అన్నాడు. నేను కొంచెం తెల్లబోయాను. ఆ సందుచివర అచ్చంగా కొండలాగానే కనిపించింది. ఎదురుగా ఉన్నది కొండనో, సముద్రమో తెలుసుకోలేకపోతే, దాని వెనక ఏముందో రవి కాంచనిచో కవి కాంచునా! పరిశీలనగా చూస్తే అప్పుడు పడవలూ, స్టీమరూ కనిపించాయి. అజ్ఞానాన్ని కప్పిపుచ్చుకోవటానికి సముద్రం అంత కొండ కావాలి మరి.

ఈ సందడిలో నాకు కథావస్తువు ఒకటి దొరికింది. అది సముద్రం అని తెలియగానే వళ్ళు ఝల్లుమంది. ఏదో ఆవేశం వచ్చింది. ఒళ్ళంతా చిరుచెమట పట్టి పిచ్చికోపంతో కణతలు అదరటం మొదలుపెట్టాయి. ఈ సముద్రమేగదా పొంగి వేలాది అమాయక ప్రజలను పొట్టనపెట్టుకున్నది? అవనిగడ్డ, పులిగడ్డ, నాగాయలంక... ఈ ప్రదేశాలన్నీ కాలేజీలో చదువుకునే రోజుల్లో పరిచయమైనవి. సముద్రం ఉప్పెనగా పొంగి రాత్రివేళ ఒక్కుమ్మడిగా కబళించి వేసింది. కుటుంబాలు కుటుంబాలు నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయినాయి. ఈ సముద్రమే గదూ? అప్పులైన వేలాదిమందిని పొట్టనపెట్టుకున్న బ్రహ్మరాక్షసిలాగా, భయంకర శత్రువులాగా కనిపించింది ఆ సముద్రం. ఈ భావన కథారూపంలో పెట్టాలనిపించింది. దానికి తగిన సన్నివేశాలు వెతుక్కోవాలి, ఊహించాలి.

తుఫాను ప్రాంతంలో అందర్నీ పోగొట్టుకున్న పసిపాపలు ఎందరో ఉన్నారు. అందులో ఒక కుర్రవాడిని ఎన్నుకున్నాను. వాడిని పెంచుకోవడానికి విశాఖపట్టణం నుండి ఒకడు వెళ్ళాడు. వాడికి పేరు పెట్టాలి. ఏం పేరు? మేం వెళ్ళిన ఆఫీసులో ఒకడి పేరు రామనాధం. ఆ పేరు పెట్టుకున్నాను. అతను ఎట్లా ఉంటాడు అని ఊహించి వ్రాయనక్కర్లేదు. వాడిని ఆఫీసులో చూశాం గదా! బట్టతల, బంగారు కళ్ళజోడు, అస్తమానం కళ్ళెగరవెయ్యటం, చొక్కా గుండీ సర్దుకోవడం, కుప్పడం అంచు ధోతి వగైరాలన్నీ కళ్ళెదుట కనిపిస్తూనే ఉన్నాయి.

ఈ కుర్రవాడికి – సోములు – అని పేరుపెట్టాను. క్యాంటీనులో టీ తెచ్చిపెట్టే కుర్రవాడి పేరు సోములు. కథలో పెంపుడుకోసం వెళ్లినవాడు ధనికుడు. కలప వ్యాపారస్థుడు– పిల్లలు లేరు. అందుకనేగా పెంచుకోవటం! సోముల్ని విమానంలో ఎక్కించుకుని తీసుకువస్తాడు. ఎందుకని? నేల మీద తన కాళ్ళమీద నిలబడలేని వాడిని ఆశల ఆకాశంలోకి తీసుకెళ్లాలి. సోములు కిటికీలోనుంచి చూస్తున్నాడు. మబ్బుల్ని పట్టుకుందామంటే కిటికీ తలుపులు వేసి ఉన్నాయి. విమానంపైకి పోతున్నకొద్దీ నేలమీద దీపాలు దూరమై నక్షత్రాల్లా కనిపిస్తున్నాయి. విమానంపైన నక్షత్రాలు క్రింద నక్షత్రాలు విశ్వాంతరాళంలో విహరిస్తూ సృష్టిలో భాగంగా

గోళంలా వెలిగిపోతున్నాడు రామనాథం అని చెప్పాలని ఉద్దేశం. అయితే ఒక సందేహం. విమానం ఎక్కింది విజయవాడ దగ్గర గన్నవరంలో, దిగింది విశాఖపట్టణంలో. ఎక్కేటప్పుడు నేలమీద దీపాలున్నాయా? లేవా? అక్కడికి విమానాలు పగలు వెళతాయా, రాత్రి వెళతాయా? రైల్లో తిరిగేవాడికి విమానాల సంగతి ఏం తెలుస్తుంది? తగాదాల్లోకి దిగకుండా దీపాల ప్రస్తావన వదిలేయాలనిపించింది. విమానం పైకి పోతుంటే క్రింద మనుష్యులు చీమల్లాగా కనిపిస్తున్నారు. చీమకీ, మనిషికీ తేడా ఏమిటి? దూరం! మనలను కదిలించివేసే సంఘటన దూరాన ఉన్న వాడికి అత్యల్పమయిన విషయం. పులిగడ్డ ప్రాంతంలో వేలాది ప్రజ హాహాకారాలతో ఆక్రందనలతో క్షణాలలో బలి అయిపోతున్న ఘోరమైన సన్నివేశం దూరాన ఉండే సంబంధం లేనివారికి సంఖ్య మాత్రమే. ఇరవైవేల మందట. అంతే అన్ని కుటుంబాల ఆశల, ఆశయాల జలసమాధి తీవ్రత ఎట్లా తెలుస్తుంది? అయితే విమానంపైకిపోతే మనుష్యులు చీమల్లాగా కనిపిస్తారా? అన్నది మళ్ళీ ప్రశ్నే. విమానంలో ఒకేసారి ప్రయాణం చేసే అవకాశం కలిగింది. అది గూడా ఆఫీసు వాళ్ళు కొంత డబ్బు ఇస్తే మిగిలింది నేను వేసుకొని ప్రయాణం చేశాను. కింద మనుష్యులు చీమల్లాగా కనిపిస్తారుట అన్న విషయం జ్ఞాపకం వచ్చింది. నా పక్కన కూర్చున్నవాడికి ఇట్లాంటి అనుమానం వచ్చి నన్ను అడిగాడు క్రిందకు చూస్తూ. నేను గూడా చూశాను. నేలమీద చీమలున్నాయి. 'అవి చీమలే, మనుష్యులు కారు' అని చెప్పాను అతనికి. అప్పటికి విమానం నేలమీదనే ఉన్నది. 'అవునవును' అంటూ అతను తికమక పడ్డట్లు జ్ఞాపకం.

సోముల్ని రామనాథం విశాఖపట్టణం తెచ్చాడు. వాన వచ్చేముందు అకాశంలా ఉన్నాయి అతని కళ్లు. కంటిరెప్పలు ఆడిస్తే నీళ్ల బొటబొటా కారిపోతాయి. కంట్లో నలుసు తీసుకుంటున్నట్లు రుమాలుతో కన్నీళ్లు అద్దుకున్నాడు. ఈ కదలో సోముల్ని తీసుకురావటానికి రామనాథం భార్య అభ్యంతరాలు చెప్పడం-కులం గురించి- ఏ కులమని, ఎవరి సంతానమని ఎట్లా తెలుస్తుంది? భగవంతుడిచ్చాడు. ఇంట్లో తన భార్యకు సంతానం కలుగుతుంది. ఆ పుట్టిన పసికందుకు కులం ఏమిటి? తన కులమే వాడికి అంటగట్టుతున్నాం. ఇప్పుడూ అంతే!

ఆ కుర్రవాడిని విశాఖపట్టణం తీసుకువచ్చి ఊరంతా చూపిస్తాడు రామనాథం. దొండపర్తి, డాబా గార్డెన్స్, ఎల్లమ్మతోట, జగదాంబా... కె.జి.హెచ్... ఆ పైన సముద్రం. నాకు కలిగిన అనుభూతులన్నీ ఆ కుర్రవాడికి ఆపాదించాను. వాడికి ఎంత అక్కసుంటుంది.? సముద్రం అంటే ఎరగని కుర్రవాడి జీవితంలో సముద్రం ప్రవేశించి నానాబీభత్సం చేసింది. ఆ శత్రువును మరిచిపోయి దూరంగా వస్తే మళ్ళీ సముద్రం ప్రత్యక్షం. అతనికి పిచ్చి కోపం వస్తుంది. అప్పుడేం చేస్తాడు? సముద్రాన్ని చేతిలో కర్రపెట్టి బాదుతాడా? కాళ్లతోనూ, చేతులతోనూ పిచ్చిగా కొట్టేస్తాడా? 'మా అయ్యా, అమ్మా, అక్కా అన్నా, తమ్ముడూ, చెల్లెలూ.... అందర్నీ ఎందుకు చంపేశావు...?' అని అసహాయంగా ప్రశ్నిస్తాడా.... ఇవన్నీ కథకు రూపాంతరాలు.

అయితే ఈ కథకు కొంత సామాజికమైన స్పృహగూడా కలిపిస్తే బాగుంటుంది గదా! కుర్రవాడు సముద్రాన్ని కొట్టడం, తిట్టడం-తిరుగుబాటుకు చిహ్నం. సముద్రం సమాజానికి ప్రతీక. సంఘం దురాచారాలకు, దాష్టీకానికి, క్రౌర్యానికి ప్రతిబింబం. దాన్ని ఎదుర్కొనటానికి ఈ కుర్రవాడి శక్తి సరిపోతుందా? అరణ్యరోదనం లాంటిదేనా?

అట్లా కాకుండా సముద్రం నిద్రాణమైన సమాజశక్తికి ప్రతిరూపం, దాన్ని రెచ్చకొట్టకుండా

ఉంటే చెలియలికట్ట లోపునే ఉండి అలలతో ఆడుకుంటూ చేతులు చాచిన వాళ్లకు చేపల్ని, రత్నాల్ని అందిస్తూ, పడవల్నీ, ఓడల్నీ మీద వేసుకుని ఆడిస్తూ ప్రశాంతంగా, గంభీరంగా ఉంటుంది. శ్రుతిమించిందా..... భీకరరూపం దాల్చి ప్రళయతాండవం చేస్తుంది. విప్లవం చెలరేగుతుంది. నిద్రాణమైన జనత విప్లవశంఖం ఊదుతుంది. అప్పుడు నష్టపోయేదెవరు? ఉప్పెన వస్తే గుడిసెల్లో ఉంటున్న పేద ప్రజలు కొట్టుకుపోయారు. విప్లవం వచ్చినా అందులో హతమారిపోయేది బీదా, బిక్కి, పేదా, సాదా మనుష్యులేనా? అని అనుమానం వస్తుంది. కథకోసం ఒక  వస్తువును చిహ్నంగా తీసుకుని కథ అల్లుకుపోతే పరిణామదశ ఎట్లా ఉంటుంది? నడిపేవాడి ఊహాబలం, ఉద్దేశాన్ని బట్టి ఉంటుంది. సముద్రమే నిద్రాణమైన జనత అవుతుంది. నిరాయుధులైన పేద ప్రజలను పొట్టన పెట్టుకున్న క్రూరసర్పమూ అవుతుంది. విప్లవజ్వాల అవుతుంది. పెట్టుకున్న కళ్లజోడును బట్టి దృశ్యం రంగు దాలుస్తుంది. ఉద్దేశాన్ని బట్టి ఊహకు రూపం వస్తుంది.

విశాఖపట్టణంలో ప్లాట్ దొరికింది. అయితే ఈ ప్లాటు అమ్మకానికి కాదు. వీలున్నపుడు స్వంతంగా కథానిర్మాణం చేద్దామనే ఉన్నది.

(రంజని - జూన్, 1978)